# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ:  14-10-2025                                      సమయం : రాత్రి 8 గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, మంగోలియా అధ్యక్షుడు ఖురేల్ సుఖ్ ఉఖ్నా మధ్య న్యూఢిల్లీలో ప్రతినిధి బృందం స్థాయి చర్చలు జరిగాయి.

❖ కాలం చెల్లిన అంతర్జాతీయ నియమాలను తొలిగించి నూతన సంస్కరణలు చేపట్టాలని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు.

❖ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) సేవలు డిజిటల్ ఆర్థిక వ్యవస్థ ఎదుగుదలకు దోహదపడతాయని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.

❖ బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ తన అభ్యర్థుల తొలి జాబితాను ఈరోజు విడుదల చేసింది.

❖ వెస్టిండీస్ తో జరిగిన రెండు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ ను భారత్ క్లీన్ స్వీప్ చేసింది.

======================

భారత్, మంగోలియా దేశాల మధ్య సంబంధం కేవలం దౌత్యపరమైనది మాత్రమే కాదని ఇరు దేశాలు ఆత్మీయమైన, ఆధ్యాత్మిక బంధాన్ని కలిగి ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, మంగోలియా అధ్యక్షుడు ఖురేల్ సుఖ్ ఉఖ్నా మధ్య ఈరోజు న్యూఢిల్లీలో ప్రతినిధి బృందం స్థాయి చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో మానవతా సహాయం, మంగోలియాలో వారసత్వ ప్రదేశాల పునరుద్ధరణ, వలసలు సహకార సంస్థల ప్రోత్సాహం, డిజిటల్ పరిష్కారాల భాగస్వామ్యం మొదలగు అంశాలపై ఇరుపక్షాల మధ్య పలు అవగాహన ఒప్పందాలు కుదిరాయి. ఈ సందర్భంగా, భారత్, మంగోలియా ద్వైపాక్షిక సంబంధాల 70వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఇరువురు కలిసి స్మారక స్టాంపులను విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సంయుక్త పాత్రికేయుల సమావేశంలో ప్రధానమంత్రి మాట్లాడుతూ... భారతదేశం మంగోలియా పౌరులకు ఉచిత ఇ-వీసాలు అందించాలని నిర్ణయించిందన్నారు. భారత్ ఆర్థిక సహాయం అందించిన చమురు శుద్ధి కర్మాగారం మంగోలియాకు ఇంధన భద్రతను బలపరుస్తుందన్నారు. సరిహద్దును పంచుకోనప్పటికీ మంగోలియాను భారత్ పొరుగు దేశంగానే పరిగణిస్తుందని నరేంద్రమోదీ పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

======================

కాలం చెల్లిన అంతర్జాతీయ నియమాలను తొలిగించి నూతన సంస్కరణలను చేపట్టాలని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఐక్య రాజ్యసమితి దళాల సహకార దేశాల (UNTCC) అధిపతుల సమావేశం ఈరోజు న్యూఢిల్లీలో ప్రారంభమైంది. కార్యాచరణ సవాళ్లు, అభివృద్ధి చెందుతున్న ముప్పులపై చర్చించడంతో పాటు భవిష్యత్ శాంతి పరిరక్షణపై ఉమ్మడి అవగాహనను పెంపొందించడానికి భారత సైన్యం మూడు రోజుల ఈ ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ప్రసంగించిన రాజ్‌నాథ్ సింగ్, కొన్ని దేశాలు అంతర్జాతీయ నియమాలను బహిరంగంగా ఉల్లంఘిస్తున్నాయన్నారు. భారతదేశం అంతర్జాతీయ నియమావళి సంస్కరణలకు మద్దతిస్తుందని, అంతర్జాతీయ నియమాలకు కట్టుబడి ఉంటుందని రాజ్ నాథ్ సింగ్ స్పష్టం చేస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

======================

బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి భారతీయ జనతా పార్టీ తన అభ్యర్థుల తొలి జాబితాను ఈరోజు విడుదల చేసింది. ఇందులో మొత్తం 71 స్థానాలకు అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరీ తారాపుర్ నుంచి మరో ఉప ముఖ్యమంత్రి విజయ్‌కుమార్ సిన్హా లఖిసరాయ్ స్థానాల నుంచి పోటీ చేయనున్నారు. ఎన్డీయే కూటమి పార్టీల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం ఈ ఎన్నికల్లో బీజేపీ మొత్తం 101 స్థానాల్లో పోటీ చేయనుంది. నవంబర్ 6, 11వ తేదీల్లో పోలింగ్ జరగనుండగా అదే నెల 14వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి అదే రోజు ఫలితాలను వెల్లడిస్తారు.

======================

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సేవలు డిజిటల్ ఆర్థిక వ్యవస్థ ఎదుగుదలకు దోహదపడతాయని కేంద్ర సమాచార, ప్రసార శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు నిర్వహించిన భారత్ ఏఐ శక్తి కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్‌ను ఏర్పాటు చేయనున్నామని గూగుల్ సంస్థ ఈ సందర్భంగా ప్రకటించింది. దేశంలో వన్ గిగా వాట్ కెపాసిటీ గల డేటా సెంటర్, గూగుల్‌కు చెందిన తొలి ఏఐ హబ్ ఈ ప్రాజెక్టులో ఉన్నాయి. ఈ ప్రకటన అనంతరం అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. దేశంలోని యువతకు ఉద్యోగ అవకాశాలను అభివృద్ధి చేయటానికి ఏఐ సేవలు అవసరమన్నారు. అలాగే ఐటీ ఉద్యోగులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు ఏఐ దోహదపడుతుందని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

విరామం

======================

దేశంలో వ్యవస్థీకృత నేరాలతో పాటూ ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (NSG) సమర్థవంతంగా పని చేస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. హర్యానాలోని మనేసర్‌లో జరిగిన నేషనల్ సెక్యూరిటీ గార్డ్, NSG 41వ వ్యవస్థాపక దినోత్సవంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ NSG హబ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు అమిత్ షా ప్రకటించారు. ముంబై, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్, అహ్మదాబాద్, జమ్మూ టాస్క్ ఫోర్స్‌లో ఇప్పటికే ఆరు NSG హబ్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి అధునాతన శిక్షణను అందించే స్పెషల్ ఆపరేషన్స్ ట్రైనింగ్ సెంటర్‌కు అమిత్ షా శంకుస్థాపన చేశారు.

======================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 127వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 24వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

======================

భారతదేశంలో మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు గణనీయంగా పెరిగింది. 2017-18 నుండి 2023-24 మధ్య, మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు 23 నుండి 42 శాతానికి పెరిగిందని కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రపంచ బ్యాంకు డేటా ప్రకారం గత దశాబ్దంలో  బ్రిక్స్ దేశాలలో మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్యంలో భారతదేశం అత్యంత గణనీయమైన పెరుగుదలను నమోదు చేసింది.

======================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ రోజు నష్టాలతో ముగిశాయి. ఉదయం సెన్సెక్స్ 82,327 పాయింట్ల వద్ద ప్రారంభమై… చివరకు 298 పాయింట్లు తగ్గి 82,029 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 82 పాయింట్లు నష్టపోయి 25,145 వద్ద ముగిసింది.

======================

భారత్, వెస్టిండీస్ పురుష జట్ల మధ్య జరిగిన రెండు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ ను భారత్ క్లీన్ స్వీప్ చేసింది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరిగిన రెండవ టెస్ట్ క్రికెట్ మ్యాచ్ లో భారత్ ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. 121 పరుగుల లక్ష్య ఛేదనలో 63 పరుగుల ఓవర్ నైట్ స్కోర్ తో ఈరోజు ఆటను ప్రారంభించిన భారత్ మరో రెండు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. కుల్‌దీప్ యాదవ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, రవీంద్ర జడేజా ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులను దక్కించుకున్నారు. వెస్టిండీస్‌పై భారత్‌కు ఇది వరుసగా 10వ టెస్ట్ సిరీస్ విజయం. ఇక భారత్ తన తదుపరి టెస్ట్ సిరీస్ ను దక్షిణాఫ్రికాతో నవంబర్ 14 నుంచి స్వదేశంలో ఆడనుంది.

======================

రానున్న 2 రోజుల్లో దేశంలోని మిగిలిన ప్రాంతాల నుండి నైరుతి రుతుపవనాల ఉపసంహరణకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. దక్షిణ భారతదేశం దాని పక్కనే ఉన్న మధ్య బంగాళాఖాతంలో తూర్పు, ఈశాన్య గాలులు ప్రారంభమవడంతో పాటు, ఈశాన్య రుతుపవనాల వర్షపాతం ఆగ్నేయ ద్వీప కల్ప ప్రాంతంలో ప్రారంభమయ్యే అవకాశం ఉందని పేర్కొంది. వీటి ప్రభావంతో దక్షిణ భారతదేశంలో ముఖ్యంగా కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో రానున్న వారం రోజుల పాటూ విస్తారంగా వర్షాలు కురుస్తాయని ఐఎండి వెల్లడించింది.

======================

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు 6.33 శాతం పెరిగి 11.89 లక్షల కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. ఏప్రిల్ 1 నుండి అక్టోబర్ 12 వరకు నికర కార్పొరేట్ పన్ను వసూళ్లు దాదాపు 5.02 లక్షల కోట్ల రూపాయలుగా ఉన్నాయని, గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 2 శాతానికి పైగా పెరిగిందని ఆదాయపు పన్ను శాఖ తెలిపింది.

========================

========================